తులన్నీ దుష్టత్రయం కల్పించినవే అని తెలుసుకోవడం లేదు. అసలు హుండీలోని కానుకలన్నీ ఏమయ్యాయని అడగడం లేదు. దుష్టత్రయం దోపిడీ మాత్రం యథేచ్ఛగా జరుగుతూనే ఉంది. ఎంత మంచివారు నామాల గ్రామ ప్రజలు. ఇలాంటి దోపిడీని ఎవరూ అరికట్టలేరా? దైవమా నీవైనా మరోసారి అవతరించవా' అనుకుంటూ తరగతి గదిలోకి వెళ్లిపోయాడు కమలాకర్.

**-టి.రామాంజనేయులు**
**(హాలహర్వి)**

# రాజకీయం

"ప్రియమైన నా ప్రజలకు నమస్కారాలు. మరి ఈ సభకు విచ్చేసిన మీ అందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. మరి మీరందరూ కూడా మీ అమూల్యమైన ఓటును నాకే వేసి గెలిపిస్తారని ఆశిస్తున్నాను. మరి ఈ గ్రామం అభివృద్ధి చెందాలంటే మరి ఈ వీధులన్నీ శుభ్రంగా పచ్చగా ఉండాలంటే మీ ఓటును మా పార్టీకే వేయాలని కోరుతున్నాను. మరి మన గ్రామమే కాదు ఈ రాష్ట్రం, ఈ దేశం బాగుపడాలంటే నేడు యువ నాయకత్వం అవసరం ఎంతైనా ఉంది. మరి ఈ సందర్భంగా మీ అందరికీ నేను సవినయంగా మనవి చేసేది ఏమిటంటే మీ ఓటును నాకే వేసి గెలిపిస్తారని ఆశిస్తున్నాను. జైహింద్."

సుదీర్ఘంగా సాగుతున్న ఉపన్యాసం ఎంత వినకూడదనుకుంటున్నా నా చెవులకు వినిపిస్తానే ఉంది. 'ఈ గొంతు ఎక్కడో విన్నట్లుందే' పైగా 'మరి' అనే ఊత పదం కూడా అనుకుంటూ సభ జరుగుతున్న ప్రదేశానికి వెళ్లాను. సభ జరుగుతున్న ప్రదేశం అంతా కోలాహలంగా ఉంది. నా ముందు ఉన్న జనాల్ని దాటుకుంటూ ముందుకు వెళ్లాను.

అప్పటి వరకూ మాట్లాడిన వ్యక్తిని చూసి నివ్వెరపోయాను. అతడు ఎవరో కాదు నేను డిప్లమో చదువుతుండగా అతడు నా క్లాస్‌మేట్. నారాయణ క్లాస్‌లో అందరితో స్నేహంగా ఉండేవాడు. అందరికన్నా నాతో ఎక్కువ స్నేహంగా ఉండేవాడు. అప్పట్లో నేను క్లాస్ ఫస్ట్.

మాది మధ్యతరగతి కుటుంబం అవ్వడం వలన సివిల్ ఇంజనీరింగ్‌లో డిప్లమో చదవడమే గగనం అయింది. నేను డిస్టింక్షన్‌లో పాస్ అయినా పై చదువులు చదివించడం నా వల్ల కాదన్నాడు నాన్న. అప్పటికే అక్క పెళ్లి చేసి కష్టాల్లో ఉన్నాడు. ఇంతలో చెల్లెలికి కూడా అనుకోకుండా మంచి సంబంధం కుదరడంతో తన పెళ్లి వ్యవహారాల్లో బిజీగా ఉన్న ఆయన్ని బి.టెక్ చదువుతానంటూ ఆగి ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక నేను కూడా నా కాళ్లపై నిలబడి నాన్నకు సహాయం చేయాలనుకున్నాను.

"ఏంటండీ ఆలోచిస్తున్నారు?" అంటూ కస్తూరి అడుగుతుంటే ఉలిక్కి పడి ఈ లోకంలోకి వచ్చాను. "మన నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీకి నిలబడిన నారాయణ ఎవరో కాదే నా బెస్ట్ ఫ్రెండ్. అతడు డిప్లమోలో నా క్లాస్‌మేట్" అని చెప్పాను ఉత్సాహంగా.


నారాయణ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందాడు. ఈ శుభసందర్భంలో అతడ్ని అభినందించాలి అనుకుంటూ వాళ్ల ఇంటికి బయలుదేరాను. నేను రావడం గమనించి...నన్ను సాదరంగా ఆహ్వానించాడు.

"ఏం చేస్తున్నావ్‌రా? బాగున్నావా? నిన్ను చూసి చాలా కాలం అయింది!" అంటూ ప్రశ్నించాడు ఆప్యాయంగా.

"నువ్వు ఎలక్షన్స్‌లో నిలబడ్డావని తెలిసి నిన్ను కలవాలని రెండుసార్లు ఇంటికి వచ్చాను. నువ్వు ఇంటి వద్ద లేవు" అంటూ చెబుతున్న నా మాటలకు అడ్డు వస్తూ..

"ఎలక్షన్స్ కదా చాలా బిజీగా ఉన్నాను. నియోజకవర్గం అంతటా సుడిగాలిలా పర్యటించవలసి వచ్చింది" అన్నాడు.

మా కాలేజీ లైఫ్ గురించి, కాలేజీలో మేము చేసిన



అల్లర్ల గురించి మా ఫ్రెండ్స్ గురించి మా బాచ్‌లర్ లైఫ్ గురించి...ఇలా ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాము.

చాలాసేపటి తరువాత అడిగాడు- "అన్నట్టు...అడగడం మర్చిపోయాను. ప్రస్తుతం నువ్వు ఏం చేస్తున్నావురా?"

"నేను ఈ సిటీలోనే సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నానురా. సొంతంగా ఆఫీసు కూడా ఈమధ్యనే తెరిచాను" చెప్పాను

"అలాగా" అంటూ ఇంట్లోంచి వాళ్ల ఆవిడ్ని పిలిచి "వీడు నా స్నేహితుడు విశ్వనాథం. రాత్రికి మనింట్లోనే భోజనం చేస్తాడు" అంటూ చెప్పాడు.

"ఎందుకులేరా...ఇంటి దగ్గర మా ఆవిడ నా గురించి ఎదురుచూస్తూంటుంది" అంటూ వాచ్ చూసుకున్నాను.నేను ఇంటికి వెళ్లిపోతానంటూ ఎంతగా చెప్పినా...అతడు నా మాట వినకుండా నన్ను ఆగమంటూ బలవంతపెట్టాడు. ఆఖరికి అతడి మాటకే విలువనిస్తూ "సర్లేరా" అన్నాను.

వాడు చదువుల్లో యావరేజ్ స్టూడెంటే అయినా ఆస్తిపరులవ్వడంతో బి.టెక్ పూర్తి చేసి పై చదువుల నిమిత్తం రెండేళ్లు అమెరికా కూడా వెళ్లి వచ్చాడు.

అమెరికాలో వాడి స్నేహితుల గురించి వాళ్ల అలవాట్ల గురించి వాడు చెబుతుంటే ఆసక్తిగా విన్నాను.

"ఈమధ్య పేపర్లో సిటీ నుండి మన ఊరికి రోడ్ శాంక్షన్ అయిందని వచ్చిందిరా. త్వరలో టెండర్లు పిలుస్తారు. ఒకవేళ ఆ టెండర్ నాకే వస్తే ముందు ముందు నీ సహాయం కావాలిరా" అంటూ అడిగాను.

"తప్పకుండా" అన్నాడు.

నేను చేసే సివిల్ వర్క్స్ గురించి కొత్తగా వేసిన, వేయబోయే టెండర్ల గురించి అడిగాడు. అన్నిటికీ సమాధానాలు చెప్పాను.

నాలో చిన్న సందేహం... 'నేను చూసిన ఆ నారాయణ ఇతడు ఒకడేనా?'

"ఏంట్రా...ఏదో ఆలోచిస్తున్నావు?"

"ఎలా చెప్పాలాని?" నసిగాను.

"చెప్పరా...విశ్వనాథం"

"నేను కాలేజీలో ఉన్నప్పుడు పరిచయం అయిన నారాయణ ఇప్పుడు నేను చూస్తున్న నారాయణ ఒకరేనా అన్న సందేహంరా. అప్పుడు ఎంత అమాయకంగా ఉండేవాడివిరా! అస్సలు ఇన్ని తెలివితేటలు ఎలా సంపాదించావు?" నేను అడిగిన ప్రశ్నకు వాడు సంతోషంతో పొంగిపోతూ... చిరునవ్వులు చిందించాడు.

సిటీ నుండి మా విలేజికి రోడ్ శాంక్షన్ అయింది. టెండర్స్ పిలిచారా? మేము మంచి కొటేషన్ వేయడం జరిగింది. ఈ ప్రాజెక్టు తప్పకుండా మాకే వస్తుందన్న ధీమా నాలో.

సమ్మర్ హాలిడేస్‌లో బెంగుళూర్ వెళదామంటూ పిల్లలు గోల చేయడంతో 'సరే' అన్నాను. 'బెంగుళూర్'లో మా శ్రీమతి వాళ్ల కజిన్ ఇంటికి చేరుకున్నాము. హాలీడేస్ అంతా అక్కడే ఉంటామని పిల్లలు అనడంతో నేను ఒక్కడినే తిరిగి వచ్చాను. ఆ రోజు.. ఆఫీసులో అడుగుపెడుతూ పి.ఎ.ని అడిగాను.

"మిస్టర్ శంకర్. రోడ్ గురించి మనం వేసిన టెండర్ ఏమయింది?""సార్. ఆ టెండర్ మనకు రాలేదు. రాజేశ్వరరావుకి వచ్చింది.".రాజేశ్వరరావ్ ఎవరో కాదు ఎమ్మెల్యే నారాయణరావుకు స్వయానా బావమరిది.

"సార్ అసలు ఈ టెండర్ మనకే రావల్సింది కానీ మనకు రాకుండా ఆ రాజేశ్వరరావుకి వచ్చేలా చేయడంలో ఎమ్మెల్యే నారాయణరావుగారి హస్తం ఉందని తెలిసింది."నా చెవులు వినడం మానేశాయి. ఆ క్షణంలోనే అర్థమయింది రాజకీయాల్లో స్నేహానికి విలువలేదని.

**-గొర్రెపాటి శ్రీను (హైదరాబాద్)**